
సాక్షి కాకినాడ

గురువారం । 6 । జూన్ । 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు జరిగాయి. టీడీపీ కార్యకర్తలు ఈ ఘటనలకు పాల్పడ్డారు.

8లో

గరిష్టం/కనిష్టం
39.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	38.1	29.0
కాకినాడ	37.0	26.0
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

టెన్సింగ్ నార్కే సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డులు–2023కు భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. సెట్రాజ్ సీఈఓ ఏవీఎస్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. గత మూడేళ్లలో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. అవార్డుగా టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, రూ.15 లక్షల నగదు బహుమతి అందిస్తారన్నారు. ఈ అవార్డును ఏటా ఆగస్టు 29న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం చేస్తారని, ఆసక్తి ఉన్న వారు జూన్ 14 లోగా https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మూర్తి సూచించారు.

ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ అభినందన



కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన అందరికీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు, ఇతర సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించారని అభినందించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. మొత్తం ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకూ తావు లేకుండా సమర్థంగా విధులు నిర్వహించిన జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. రాజకీయ పక్షాల ప్రతినిధులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల సామగ్రిని భద్రపరచాలి



ఎన్నికల సామగ్రిని భద్రపరిచే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జిల్లాలో ఎన్నికలు సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయిన నేపథ్యంలో అధికారులు ఎన్నికల సామగ్రిని భద్రపరిచే ప్రక్రియ ప్రారంభించారు. జేఎన్‌టీయూకేలో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని ఆయన నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో తరలించే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాములో భద్రపరుస్తున్న ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను, జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరుస్తున్న ఇతర ఎన్నికల సామగ్రిని జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని సక్రమంగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఈవీఎం గోదాములో ఆయా నియోజకవర్గాల వారీగా భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు సర్టిఫికెట్ల పరిశీలన చేయించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐ అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఈ నెల 10వ తేదీ లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్ వేణుగోపాలవర్మ బుధవారం తెలిపారు. అభ్యర్థులు తమ సమీపంలో ఉన్న అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయం, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకోవచ్చని సూచించారు. మొత్తం 1,284 మంది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోగా, వీరిలో 583 మంది మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారని చెప్పారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే అడ్మిషన్లు రావని స్పష్టం చేశారు.

నేటి నుంచి బస్ పాస్‌ల పంపిణీ

కాకినాడ సిటీ: విద్యార్థులకు గురు, శుక్రవారాల్లో యథాతథంగా బస్ పాస్‌లు ఇవ్వనున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపో అధికారులు బుధవారం తెలిపారు. సాఫ్ట్‌వేర్ మార్పు కార్యక్రమం వాయిదా పడినందున ఈ నెల 8 నుంచి కాకుండా గురువారం నుంచే పాస్‌లు యథావిధిగా ఇస్తామని పేర్కొన్నారు.

ఏం మాయ చేశారో..

- వైఎస్సార్ సీపీ ఓటమికి అంతు చిక్కని కారణాలు
- జగనన్న వెంటే జనం
- అయినా పరాజయం
- జీర్ణించుకోలేకపోతున్న ప్రజానీకం
- మోసం జరిగిందేమోనని అనుమానం
- ఈవీఎంలు ట్యాంపర్ చేశారేమోనని సందేహం



దేశంలోనే ఇదివరకెన్నడూ చూడని జనరంజక పాలన.. గ్రామ/వార్డు సచివాలయాలతో ప్రజల ముంగిట్లోనే అన్ని ప్రభుత్వ సేవలు.. విద్యార్థులు, మహిళలు, రైతులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, ఇతర అభాగ్యులు.. ఇలా అందరికీ ఏదో ఒక రూపంలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ సాయం..

పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ చదువుల్లో విప్లవాత్మక మార్పులు.. నాడు – నేడుతో పాఠశాలల ఆధునీకరణ.. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లతో విద్యా బోధన.. ఇంగ్లిష్ మీడియం చదువులు.. బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన.. ఇలా ఎన్నో రూపాల్లో సహకారం..

పీహెచ్‌సీల నుంచి ప్రభుత్వాస్పత్రుల వరకూ ఆధునీకరణ, ఆధునిక పరికరాల ఏర్పాటు, మెరుగైన వైద్య సేవలు, మునుపెన్నడూ ఎవ్వరూ ఎరుగని విధంగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ కంటి వెలుగు.. ఇంకా వేలాది మంది ప్రాణాలను హరించిన కరోనా మహమ్మారి సమయంలో ప్రజలకు అడుగడుగునా అండదండలు.. వారి ప్రాణరక్షణకు పటిష్ట చర్యలు..

అందరినీ ఆదుకునే అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకూ అడుగడుగునా అండ.. రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత..

ఇంకా మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా.. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం.. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర.. ఇంకా ఎవరికైనా అనుకోని కష్టం వస్తే నేనున్నానంటూ భరోసా.. వీటితో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు, పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు, ఉపాధి కల్పన.. ఎంఎస్‌ఎంఈలకు ఆర్థిక ప్రోత్సాహం, ఫిషింగ్ హార్బర్లు.. ఇలా గడచిన ఐదేళ్ల పాటు ఎన్నో రూపాల్లో సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించి.. అభివృద్ధికి సరికొత్త అర్థం చెప్పి.. ప్రభుత్వం అంటే ప్రజల కోసమే పని చేసేదని అడుగడుగునా చాటి చెప్పారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

అందుకే ఐదేళ్ల అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన సారథ్యంలోని వైఎస్సార్ సీపీకే మెజారిటీ ప్రజలు ఓట్లు వేశారు. కానీ, తాము వేసిన ఓట్లు ఏమయ్యాయనే ప్రశ్న ఇప్పుడు వారిని వేధిస్తోంది. ఆ పార్టీకి అత్యధికంగా ఓట్లు పోలైన చోట్ల కూడా టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థులకు మెజారిటీలు రావడం అనేక మంది ఓటర్లను ఆశ్చర్యపరుస్తోంది. సీఎం జగన్ పాలన పట్ల పెద్దగా ప్రజా వ్యతిరేకత లేనేలేదు. అలాగని కూటమి నేతల పట్ల సానుభూతీ లేదు.

దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్, పోస్ట్ పోల్ సర్వేలూ వైఎస్సార్ సీపీ విజయం నల్లేరుపై నడకేనని ఢంకా బజాయించి మరీ చెప్పాయి. మరి అటువంటప్పుడు వైఎస్సార్ సీపీ ఎందుకు ఓడిపోయింది? ఒకవేళ ఓడినా.. అంత తక్కువ సీట్లు ఎందుకు వచ్చాయి? పైగా కూటమి అభ్యర్థులకు అంతంత భారీ మెజారిటీలు రావడమేమిటి? ఇదే ప్రశ్న ఇప్పుడు పలువురు ఓటర్లు వేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎక్కడైనా ఏదైనా కుట్ర జరిగిందేమోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఈ ఫలితాలు దారుణం



సార్వత్రిక ఎన్నికల్లో వెలువడిన ఫలితాలు చాలా దారుణం. కావాలనే కూటమి నేతలు కుయుక్తులు పన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకుండా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజానీకం వైఎస్సార్ సీపీ వైపే ఉన్నా, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసినా, కూటమి అభ్యర్థులకు పడేలా చేశారు. ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదు.

– గవరసాని సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, కాండ్రకోట, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా

అయోమయంగా ఉంది



ఎన్నికల ఫలితాలు అయోమయానికి గురి చేశాయి. అన్ని సామాజిక వర్గాల వారూ వైఎస్సార్ సీపీకే ఓట్లు వేశారు. ఎన్నికల రోజున అడిగితే ఫ్యాన్ గుర్తుకే వేశామని ఎక్కువ శాతం మహిళలు, వృద్ధులు తెలిపారు. తీరా ఎన్నికల ఫలితాలు చూస్తే కూటమికి మెజార్టీ చూపించింది. ఫలితాలు చూసి ఆశ్చర్యపోయాను. ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు.

– చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ కరప మండల అధ్యక్షుడు, పెద కొత్తూరు, కాకినాడ జిల్లా

వైఎస్సార్ సీపీకే ఓటేశాం



మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టాలని కోరుకుంటూ మేమందరం వైఎస్సార్ సీపీకే ఓటు వేశాం. ఎన్నికల ఫలితాలు చూస్తే చాలా భిన్నంగా ఉన్నాయి. ఈ ఫలితాలు నిజమేనా అని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. అభ్యర్థులకు భారీ మెజార్టీలు రావడంపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి.

– చింతపల్లి గోపాల్‌రెడ్డి, నాగులపల్లి, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

ఆశ్చర్యం కలిగించింది



ఎన్నికల ఫలితాలు ముస్లిం మైనార్టీ వర్గాలను తీవ్ర నిరాశకు గురి చేశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి అధికారం చేపడతారని బలంగా నమ్మాం. ఎన్నో సంక్షేమ పథకాల అమలు ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఆయన అధికారానికి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం.

– ఎండీ వలీ బాషా, మక్కా మస్జిద్ మాజీ అధ్యక్షుడు, కాకినాడ

అనుమానం కలుగుతోంది



ఎన్నికల ఫలితాలు, మెజార్టీలు చూస్తుంటే అనుమానం కలుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకుండా ఉండేందుకు కుట్ర పన్నినట్టు కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజానీకమంతా వైఎస్సార్ సీపీ వైపే ఉంది. మా కుటుంబ సభ్యులందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో చాలా మందే ఓటు వేశారని అనుకుంటున్నాం. అయినా ఇలా జరగడం అయోమయంగా ఉంది. గతంలో ఏ పార్టీకి చూసిన 1000 నుంచి 10 వేల మెజార్టీలు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు కూటమి అభ్యర్థులకు ఏకంగా 40 వేల నుంచి 70 వేల మెజార్టీలు చూస్తుంటే ఏదో జరిగిందనే అనుమానాలు వస్తున్నాయి.

– జిక్కిలింక రామకృష్ణ, తాళ్లూరు, గండేపల్లి మండలం, కాకినాడ జిల్లా

ఏం జరిగిందో..



వీకే రాయపురం ఎప్పుడూ వైఎస్సార్ సీపీకి ఆయువుపట్టుగా ఉంటుంది. మా ఇంట్లో ఓట్లన్నీ వైఎస్సార్ సీపీకే వేశాం. ఏం జరిగిందో తెలియదు. ఊహించని విధంగా పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఓటమి చెందారు.

– రేలంగి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, వీకే రాయపురం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా

అర్థం కాలేదు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా, ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టి, మా పిల్లల చదువులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగుపరిచారని తల్లిదండ్రులు మా దృష్టికి తీసుకువచ్చేవారు. వాటితో పాటు అమ్మ ఒడి, రైతు భరోసా, పింఛన్లు.. ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగన్‌కే మా ఓటు అని ప్రజలు చెప్పారు. కానీ ఓటు వేసే విషయంలో ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారో అర్థం కాలేదు.

– వేగి రామకృష్ణ, కిర్లంపూడి, కాకినాడ జిల్లా

నమ్మలేకపోతున్నాం



ఈ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజలకు అర్థం కాని స్థితిలో ఉన్నాయి. మేమందరం వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు ఓటు వేశాం. వైఎస్సార్ సీపీయే ఘన విజయం సాధిస్తుందని ఎంతో ఆకాంక్షించాం. ఫలితాలు చూస్తుంటే ఇది నిజమేనా అని అనిపిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదేనా అనిపిస్తోంది. నమ్మలేకపోతున్నాం.

– జిక్కి శ్రీనివాసరావు, ఉప్పరగూడెం, నాగులపల్లి, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

జీర్ణించుకోలేకపోతున్నాం



సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. ఎన్నికల్లో విజయం కోసం ఎంతో కష్టపడి పని చేశాం. నాయకులు, కార్యకర్తలందరం కలసికట్టుగా పని చేశాం. ప్రతి ఓటరునూ కలిసి ఓటు అభ్యర్థించాం. ప్రభుత్వం చేసిన మంచిని వివరించి, అండగా నిలవాలని విజ్ఞప్తి చేశాం. మొదటి నుంచీ విజయం సాధిస్తామని ఆశాభావంతో ఉన్నాం. ఎన్నికలు జరిగిన తరువాత ఆ ఆశాభావం మరింత పెరిగింది. కౌంటింగ్ రోజు వరకూ గెలుపు అంచున ఉన్నామనే భావించాం. ఏం జరిగిందో తెలియదు కానీ అనూహ్య ఓటమి హృదయాలను రగిలించింది.

– వెలగా వెంకట కృష్ణాజీ, తుని ఏఎంసీ వైస్ చైర్మన్, కోటనందూరు, కాకినాడ జిల్లా

ఎంతో బాధ పడ్డాం



జగన్‌మోహన్‌రెడ్డి ఓడిపోతారని కలలో కూడా ఊహించలేదు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. మా ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎంతో శ్రమ పడ్డారు. ఇటువంటి నాయకులు ఓడిపోయారంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాం. మా ప్రాంతంలోని మత్స్యకారులంతా వైఎస్సార్ సీపీకే ఓటు వేశాం. ఎందుకు ఓడిపోయారో అర్థం కావడం లేదు.

– చొక్కా కాసులమ్మ, మత్స్యకార మహిళ, దుమ్ములపేట, కాకినాడ

వైఎస్సార్ సీపీ పథకాలు మెచ్చి ఓటేశాం



బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేశారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందించారు. ఈవిధంగా పాలన అందించిన వైఎస్సార్ సీపీ ఓటమి చెందిందంటే తట్టుకోలేకపోతున్నాం. మా గ్రామంలో ఎక్కువ శాతం మంది వైఎస్సార్ సీపీకే ఓటు వేశాం.

– కలగాని దేవుళ్లు, వార్డు మెంబర్, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా

ఈ ఓటమి చాలా బాధాకరం



వైఎస్సార్ సీపీ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. అనేక పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేసిన వైఎస్సార్ సీపీ ఓటమి చెందడం చాలా బాధాకరం. మేము, మా బంధువులంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేశాం.

– పగడాల బాబ్జీ, మాజీ సర్పంచ్, శంఖవరం, కాకినాడ జిల్లా

జనసేనకు ఇంత మెజార్టీయా..!



నేను, నా కుటుంబం వైఎస్సార్ సీపీకే ఓటు వేశాం. మా గ్రామంలో, మా నియోజకవర్గంలో ప్రజలు అత్యధికంగా వైఎస్సార్ సీపీకే ఓటు వేశారు. ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యమనిపించాయి. అందులోనూ మా నాయకుడు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కన్నబాబుపై జనసేన అభ్యర్థికి 72 వేల మెజార్టీ రావడం ఆశ్చర్యం. ఇది నమ్మశక్యంగా లేదు. నాలాగే చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

– కరీం బాషా, వాకలపూడి, కాకినాడ రూరల్

నమ్మబుద్ధి కావడం లేదు



ప్రజలకు మంచి చేసే నాయకుడికి ఇంత దారుణమైన ఓటమా! ఆశ్చర్యంగా ఉంది. సంక్షేమ ఫలాలను దళారీలు లేకుండా నేరుగా లబ్ధిదారుకు చేర్చడమే నేరమైందా? ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చిన ఘనతను మూట కట్టుకున్న నాయకుడికిచ్చే ప్రతిఫలమిదా? అన్ని వర్గాలకూ మేలు చేసినా కూడా ఓటమి పాలయ్యారంటేనే ఆశ్చర్యం కలుగుతోంది. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. కానీ ఇంత వ్యత్యాసం అంటేనే నమ్మబుద్ధేయడం లేదు.

– నల్లమిల్లి నానాజీ, ప్రత్తిపాడు, కాకినాడ జిల్లా

ఈవీఎంలపై అనుమానం



ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అనుమానం ఉంది. మేమంతా ఫ్యాన్ గుర్తుపై గంపగుత్తగా ఓట్లు వేశాం. ఈవీఎంలపై చేపట్టిన కౌంటింగ్ విధానంలో ఎక్కడో మోసం జరిగిందని భావిస్తున్నాను. లేకుంటే అంత స్థాయిలో మెజార్టీలు వచ్చాయంటే, తప్పనిసరిగా ఎక్కడో ఏదో మోసం జరిగింది.

– గిడుతూరి రమణమ్మ, గుమ్మరేగుల, రౌతులపూడి మండలం, కాకినాడ జిల్లా

మా ఓట్లు ఏమైపోయాయో?



జి.మేడపాడు గ్రామంలో ఎవరిని అడిగినావైఎస్సార్ సీపీకే ఓట్లు వేశామని చెబుతున్నారు. నేను, నా కుటుంబం అంతా ఫ్యాను గుర్తుకే ఓట్లు వేశాం. అయితే ఆ ఓట్లు ఏమైపోయాయో అర్థం కావడం లేదు. జి.మేడపాడు గ్రామంలో 102 నుంచి 109 వరకూ పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 106 మినహా మిగిలిన అన్ని బూత్‌లలోనూ టీడీపీకి ఎక్కువ ఓట్లు పడినట్లు ఫలితాలు రావడం ఆశ్చర్యంగా ఉంది. వైఎస్సార్ సీపీ అభిమానుల బూత్‌లలోనూ ఫలితాలు తారుమారయ్యాయి.

– పుట్టా బుజ్జిబాబు, రైతు, జి.మేడపాడు, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా

ఓటమి అంతు చిక్కడం లేదు



వైఎస్సార్ సీపీకి గ్రామంలో పట్టు ఉంది. ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు కోరుకున్నారు. ఓట్లు బాగానే పడ్డాయి. కానీ ఫలితాల్లో అనూహ్యంగా వచ్చిన ఓటమి అంతు చిక్కడం లేదు.

– మంగెన సూర్య కృష్ణకుమారి, లక్కవరం, మలికిపురం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రకృతి పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా అటవీ అధికారి భరణి

కాకినాడ సిటీ: ప్రకృతి పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యా శాఖ, అటవీ శాఖల ఆధ్వర్యాన కాకినాడ వివేకానంద పార్కు శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 2న నిర్వహించిన జిల్లా స్థాయి పర్యావరణ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో పర్యావరణ పరిరక్షణ ఒక భాగం కావాలన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం, ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకినాడ ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రకృతి వనరుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకూ ప్రతి పాఠశాలలోనూ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ డాక్యుమెంటరీని ఈ సందర్భంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంద్రజాలికుడు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వీఎస్‌వీ రమణమూర్తి పర్యావరణంపై చేసిన ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మన పర్యావరణం అనే అంశంపై ప్రముఖ పప్పెట్రీ శిక్షకుడు పిల్లి గోవిందరాజులు చేసిన పప్పెట్రీ షో అలరించింది. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు గోపీ కాశీ విశ్వనాథ్, కార్యదర్శి అరిగెల బాబీ, గ్రంథాలయ అధికారి ములంపాక శ్రీనివాసరావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, అటవీ సెక్షన్ అధికారి ఎం.నాగార్జున, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ డి.మహేష్‌బాబు, ఎస్.వీరభద్రరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

గోదా'వరి సిరులు' కురిసేలా..

- ఈ నెల 1 నుంచే డెల్టాలకు నీటి విడుదల
- ముందస్తు సాగుకు ప్రోత్సాహం
- ఖరీఫ్ త్వరగా పూర్తి చేస్తే సజావుగా రబీ
- మూడో పంటకూ అవకాశం



తూర్పు డెల్టా కాలువ నుంచి విడుదలవుతున్న నీరు

ధవళేశ్వరం: గోదావరి డెల్టాలో ఖరీఫ్ వరి సిరులు కురిపించాలి.. అన్నదాతలకు అన్నివిధాలా మేలు జరగాలి.. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించే వారి పంటలు ప్రకృతి విపత్తుల బారిన పడకుండా ఉండాలి.. రబీ సాగు కూడా సజావుగా సాగాలి.. మూడో పంటకూ అవకాశం చిక్కాలి.. తద్వారా వారి ఇళ్లు ధనధాన్యాలతో కళకళలాడాలి.. ఇదే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు మూడేళ్లుగా ముందస్తు సాగును ప్రోత్సహిస్తోంది.

దీనికి అనుగుణంగానే ఏటా జూన్ 1వ తేదీనే ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల్లోని పంట కాలువలకు ముందస్తుగా నీటిని విడుదల చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి ఈ నెల 1వ తేదీన డెల్టా కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. గత రబీ పూర్తయిన 21 రోజుల్లోనే ఖరీఫ్‌కు సాగు నీరు విడుదల చేయడం విశేషం. దీనివల్ల వరదలు, తుపానుల బారిన పడకుండా ఖరీఫ్ పంట రైతన్నల చేతికి అందనుంది. ఖరీఫ్ త్వరగా పూర్తి చేస్తే రబీ సాగు కూడా సజావుగా సాగనుంది. రబీ డిసెంబర్‌లో ప్రారంభించి, మార్చిలోపు పూర్తి చేయగలిగితే నీటి ఎద్దడి నుంచి బయటపడవచ్చు. దీంతో పాటు ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తు సాగుపై వ్యవసాయ, ఇరిగేషన్ యంత్రాంగం ఇప్పటికే అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. త్వరితగతిన పంటలు వేసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు.

10.13 లక్షల ఎకరాల సాగు

గోదావరి డెల్టాలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రైతులు ఖరీఫ్‌లో 10,13,161 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తూర్పు డెల్టాలో 2,81,303 ఎకరాలు, మధ్య డెల్టాలో 2,01,896 ఎకరాలు, పశ్చిమ డెల్టాలో 5,29,962 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఖరీఫ్ సాగు అక్టోబర్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. డిసెంబర్ మొదటి వారంలో రబీని ప్రారంభిస్తే మార్చి నాటికి పూర్తి చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఖరీఫ్‌లో పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. దీనివలన గోదావరి డెల్టాలో ఎటువంటి నీటి ఎద్దడీ తలెత్తడం లేదు. రబీలో మాత్రం ఏప్రిల్ నెల వచ్చేసరికి నీటి ఎద్దడి తలెత్తుతోంది. రబీలో శివారు ప్రాంతాలకు ఎద్దడి లేకుండా నీరు అందించాలంటే ఖరీఫ్ త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. నీరు పుష్కలంగా ఉన్న సమయంలో సద్వినియోగం చేసుకుంటే, నీటి ఎద్దడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్‌కు సకాలంలో నీటిని విడుదల చేశారు.

సకాలంలో నాట్లు వేసుకోవాలి

రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలి. దీని వలన ప్రకృతి విపత్తులు, తుపానులు, వరదల బారిన పడకుండా పంట చేతికి వస్తుంది. ఈ నెల 1 నుంచి నుంచి డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నాం. సాగు త్వరగా ప్రారంభించడం ద్వారా త్వరగా పూర్తవుతుంది.

– ఆర్.సతీష్‌కుమార్, సీఈ, గోదావరి డెల్టా సిస్టం

క్లుప్తంగా

డ్వాక్రా సొమ్ము చెల్లిస్తానంటూ టోకరా



సీసీ కెమెరాలో గుర్తించిన నిందితుడి చిత్రం

ఆలమూరు: ఆలమూరు యూనియన్ బ్యాంక్‌లో ఒక మహిళకు అపరిచిత వ్యక్తి టోకరా వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గత నెల 15న జొన్నాడకు చెందిన ఒక మహిళ తమ డ్వాక్రా సంఘం వాయిదాను చెల్లించేందుకు స్థానిక యూనియన్ బ్యాంకుకు వచ్చింది. ఆ సమయంలో అక్కడ ఒక అపరిచిత వ్యక్తి బ్యాంకులో ఉన్న మహిళ వద్దకు వచ్చి రద్దీగా ఉన్నందున తానే క్యాష్ కౌంటర్‌లో సొమ్ము చెల్లిస్తానంటూ నమ్మబలికాడు. దీంతో పాటు రశీదు కూడా రాసి ఆ మహిళ వద్ద నుంచి రూ.33 వేలు తీసుకుని క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లాడు. కొద్ది సమయం తరువాత సొమ్ము కట్టిన రశీదు తీసుకువచ్చి ఆ మహిళకు ఇచ్చాడు. తర్వాత ఆమె ఇంటికి వెళ్లిపోయింది. అయితే మే నెలకు సంబంధించి డ్వాక్రా రుణం వాయిదా చెల్లించలేదని సంబంధిత యానిమేటర్ ద్వారా బ్యాంకు సిబ్బంది కబురు పంపించారు. దీంతో ఆ మహిళ ఆఘమేఘాలపై యూనియన్ బ్యాంకు వద్దకు వచ్చి జరిగిన సంఘటనను వివరించి సొమ్ము చెల్లించిన రశీదును చూపించారు. ఆ రశీదు నకిలీదని, అపరిచిత వ్యక్తి టోకరా వేశాడని తెలిపారు. దీనిపై సత్వరం స్పందించిన బ్యాంకు అధికారులు స్థానిక పోలీసుల సాయంతో సీసీ కెమెరా నుంచి పుటేజీ తీయించి అపరిచిత వ్యక్తి ఫోటోను బుధవారం మీడియాకు అందించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెద్దాపురం: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన సంక్షేమ తరగతుల గురుకుల పాఠశాలల్లో 2024–25 సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పెద్దాపురం గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ సీకేపీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 6, 7, 8 తరగతుల్లో విద్యార్థుల ప్రవేశానికి ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, అమలాపురం సమనస, కరప, తుని, అనపర్తిలో బాలుర పాఠశాలలు, రామచంద్రపురం, బొమ్మూరులోని బాలిక గురుకుల పాఠశాలలో చేరేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు, ఈ నెల 20న అమలాపురం సమనస గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

మెళకువలు నేర్చుకున్నా..



చిత్రలేఖనం అంటే నాకు ఇష్టం. ఖాళీ సమయాల్లో చిత్రాలు వేస్తుంటాను. గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతుల్లో మరిన్ని మెళకువలు నేర్చుకున్నాను. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కొత్త అంశాలను నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది. హిందీ భాషపై మరింత సాధించాను.
–డి.సౌమ్య, 5వ తరగతి, ఉప్పాడ

శిక్షణ బాగుంది



ఈ వేసవి శిక్షణ తరగతుల్లో సరికొత్త విషయాలు తెలుసుకుంటున్నాను. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నాను. నాకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇంటి దగ్గరే ఉండి టీవీలకు అతుక్కుపోకుండా ఇలా శిక్షణను వినియోగించుకోవడం బాగుంది.
–యు.మోజేష్, 7వ తరగతి, ఉప్పాడ

ఎంతో ఉపయోగకరం



విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద గ్రంథాలయాల్లో తరగతులు నిర్వహిస్తున్నాం. నిపుణులచే పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నాం.
–వి.సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

రెట్టింపు సంఖ్యలో వచ్చారు



ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలకు వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో హాజరయ్యారు. మా గ్రంథాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందిస్తున్నాం. ఈ ఏడాది విజయవంతంగా శిక్షణ తరగతులు సాగాయి.
–టి.నళిని ప్రియ, గ్రంథాలయ అధికారి, ఉప్పాడ

విజ్ఞానం... వినోదం... వికాసం

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ
- సృజనాత్మకత వెలికితీసేలా తర్ఫీదు
- ఉమ్మడి జిల్లాలో 800 మంది హాజరు



ఉప్పాడ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు



క్రాఫ్ట్ వర్క్ నేర్చుకుంటున్న విద్యార్థులు

కొత్తపల్లి: విజ్ఞానం పెంచేలా.. వినోదం పంచేలా.. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా.. భావవ్యక్తీకరణ నేర్పేలా.. చదువు ప్రాముఖ్యత తెలిపేలా.. సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సాగుతున్నాయి. జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 100 గ్రంథాలయాల్లో గత నెల 15న వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొత్తం మూడు జిల్లాల్లో సుమారు 800 మంది శిక్షణ పొందుతున్నారు. ఒక్క కాకినాడ జిల్లాలోని 35 గ్రంథాలయాల్లో 300 మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. ఈ నెల 7వ తేదీ శుక్రవారం వరకూ ఇవి కొనసాగనున్నాయి. చిన్నారుల్లోని సృజనాత్మకత వెలికితీసేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేకంగా ఈ శిబిరాలను నిర్వహిస్తోంది. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యార్థులు గ్రంథాలయాల్లోనే ఉంటూ విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, భావవ్యక్తీకరణ, ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా తర్ఫీదు తీసుకుంటున్నారు. పుస్తక పఠనం, కథలు వినడం రాయడం, చదరంగంతో పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆకట్టుకునేలా కథలు చెప్పడం, నీతి కథల్లో మానవీయం, ప్రవర్తన, భావవ్యక్తీకరణ వంటి అంశాలను వివరిస్తున్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగను అందిస్తున్నారు. ఐదు నుంచి 16 ఏళ్లలోపు వయసున్న విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు.

రోజువారీ ప్రణాళిక ఇదీ..

ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదివిస్తున్నారు. 10 నుంచి 10.10 గంట వరకూ విరామం, 10.10 నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం, 11 నుంచి 12.30 గంటల వరకూ స్పోకింగ్ ఇంగ్లిషు, హిందీ, డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, యోగా, ధ్యానంలో శిక్షణ ఇస్తున్నారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పిడుగుపాటుకు మహిళ దుర్మరణం



ఏలూరు దేవి (ఫైల్)



వేగేశ్వరపురంలో పిడుగుపడి మృతి చెందిన గేదె

రౌతులపూడి: మండలంలోని ఎస్.అగ్రహారంలో పిడుగు పడి బుధవారం ఓ మహిళ మృతి చెందింది. ఆ గ్రామానికి చెందిన ఏలూరు దేవి (30) గ్రామ శివారు ప్రాంతంలోని కొండ ప్రాంతానికి కట్టెల నిమిత్తం భర్త, పిల్లలతో కలసి వెళ్లింది. కుటుంబ సభ్యులకు కొంత దూరంలో కట్టెలు సేకరిస్తుండగా పిడుగు పడింది. ఒక్కసారిగా అపస్మారక స్థితిలో పడిపోయిన ఆమె కొద్ది సేపటికి మృతి చెందింది. ఈ ఘటనపై రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గేదె మృతి

తాళ్లపూడి: పిడుగుపాటుకు ఓ పాడి గేదె మృతి చెందింది. వేగేశ్వరపురం గ్రామానికి చెందిన వనమాల రమణ వర్షం కురుస్తుండడంతో పొలం నుంచి తమ గేదెలను ఇంటికి తరలిస్తున్నారు. ఇంతలో ఓ గేదెపై పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో రోడ్డు పక్కన గోతిలో పడి చనిపోయింది. తన కళ్ల ముందే సుమారు రూ.1.50 లక్షల విలువైన గేదె మృతి చెందిందని రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

రక్తదానం ప్రతి పౌరుడి బాధ్యత



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న తొగరు మూర్తి

రామచంద్రపురం: రక్తదానం సేవ మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ డోనార్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంకులో బుధవారం నియోజకవర్గానికి చెందిన పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు, సిబ్బంది 17 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మూర్తి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు రక్తం ఆవశ్యకత ఎంతో ఉంటుందన్నారు. విద్యావంతులైన యువకులు రక్తదానంపై అందరికీ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణని సంప్రదించి, మీ పరిధిలోని సిబ్బందితో రక్తదానం చేయించాలని కోరగా వెంటనే స్పందించిన ఆయన తన తోటి డాక్టర్లు, సిబ్బందితో రక్తదానం చేయించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ మానవత్వంతో ప్రభుత్వ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేసిన సిబ్బందికి, డాక్టర్లకు అభినందనలు తెలిపారు. పశు వైద్యాధికారులు పి.రామచంద్రరావు, ఎం.బిందు, కృష్ణార్జున్, సుధీర్, సిబ్బంది కిశోర్, నాగేంద్ర, ఆనంద్, నారాయణరావు, సింధుబాబు, స్వామి అశోక్, నరేంద్ర, హేమంత్, నిఖిల్, ఆనంద్ తదితరులు రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సునీత, సిబ్బంది సీహెచ్ వాసు, కె.వాసు, ప్రభాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

‘పది’ మూల్యాంకనంలో మార్పులు

- గణితానికి ఆన్‌లైన్‌లోనే..
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అమలు

రాయవరం: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేపట్టే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను కూడా ఆన్‌లైన్‌లోనే మూల్యాంకనం చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ మార్పులకు ప్రభుత్వ పరీక్షల విభాగం అవసరమైన చర్యలు చేపట్టింది. మాన్యువల్ స్పాట్ వాల్యుయేషన్ స్థానంలో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చింది. విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండేందుకు మూడంచెల విధానం అమలుకు నిర్ణయించింది. వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నుంచి దీనిని పూర్తిస్థాయిలో అమలు చేయనుంది. ప్రస్తుతం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గణితం సబ్జెక్టు జవాబు పత్రాలను ప్రయోగాత్మకంగా ఈ కొత్త పద్ధతిలో మూల్యాంకనం చేయనుంది.

ఏర్పాట్లన్నీ పూర్తి



పది పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ముఖ్యంగా స్పాట్ కేంద్రంలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు తాగునీరు, ఫర్నీచర్ తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశాం. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన గడువులోగా జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేస్తాం.
–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

ఎలా చేస్తారంటే..

పది సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 24 నుంచి ప్రారంభమై జూన్ 1వ తేదీ వరకూ నిర్వహించారు. కోనసీమ జిల్లాలో 1,594 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 826 మంది పరీక్షలు రాశారు. వారికి 24 పేజీల జవాబు పత్రం బుక్‌లెట్ ఇచ్చారు. ఈ పత్రాలను విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, తిరుపతిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కేంద్రాల్లో పార్ట్–1 రాకుండా ఇతర జవాబు పత్రం మొత్తం స్కాన్ చేస్తారు. ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు ఇచ్చిన ట్యాబ్స్ సహాయంతో ఉపాధ్యాయులు ఈ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఒక్కొక్కరికి 75 వరకూ జవాబు పత్రాలను కేటాయిస్తారు. ప్రతి జిల్లా నుంచి 50 మంది చొప్పున మొత్తం 1,200 మంది కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి జాబితాలను పంపించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఇప్పటికే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లలో లాగిన్ అయితే తెరమీద ఒకవైపు జవాబు పత్రం, మరోవైపు మార్కులు వేసేందుకు టేబుల్ వస్తాయి. జవాబు పత్రంలో సమాధానం చూసి దానికి మార్కులు టేబుల్‌లో వేస్తారు. ఇలా ఒక ఉపాధ్యాయుడు దిద్దిన జవాబు పత్రాన్ని మరో టీచర్‌కు పంపించి మూల్యాంకనం చేయిస్తారు. ఈ ఇద్దరి మూల్యాంకనంలో పది శాతం కంటే ఎక్కువ మార్కుల తేడా వస్తే అప్పుడు మూడో ఉపాధ్యాయుడికి పంపించి అక్కడ వచ్చిన మార్కులను ఫైనల్ చేస్తారు.

నేటి నుంచి ప్రారంభం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల ఫిజికల్ మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానుంది. అమలాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూల్యాంకనాన్ని స్పాట్ కేంద్రం క్యాంప్ ఆఫీసర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఆధ్వర్యంలో ప్రారంభిస్తారు. స్పాట్ కేంద్రాన్ని ఈ నెల తొమ్మిదవ తేదీతో ముగించాల్సి ఉంది. వివిధ జిల్లాల నుంచి గణితం మినహా 8,729 జవాబు పత్రాలను కేటాయించారు. తెలుగు 2,549, కాంపోజిట్ తెలుగు 21, హిందీ 136, ఇంగ్లిషు 264, ఫిజికల్ సైన్స్ 3,009, బయలాజికల్ సైన్స్ 1,880, సోషల్ స్టడీస్ 870 పేపర్లను జిల్లాకు కేటాయించారు. ఇందుకు గాను 30 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 173 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 59 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

నీట్–24 ఫలితాల్లో ‘ఆదిత్య’ ప్రతిభ



వి.సృజన్



ఎస్‌హెచ్‌డీ శ్రావణ సత్యరవికిరణ్



ఎం.విశ్వంత్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నీట్–24 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణ దీపక్‌రెడ్డి బుధవారం తెలిపారు. వి.సృజన్ 715 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీ 115 ర్యాంక్, ఎస్‌హెచ్‌డీ శ్రావణ సత్యరవికిరణ్ 710 మార్కులతో 411వ ర్యాంక్, ఎం.విశ్వంత్ 705 మార్కులతో 104వ ర్యాంక్, ఎం.నైమితరాణి 382 ర్యాంక్ సాధించారన్నారు. వీరితో పాటు 700కుపైన నలుగురు, 650కు పైన 19 మంది, 600కు పైన 36 మంది, 550కు పైన 72 మంది ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారన్నారు. తమ విద్యాసంస్థల నుంచి 100 మెడికల్ సీట్లతో ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అగ్రగామిగా ఆదిత్య నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని హాస్టల్ డైరెక్టర్ ఎన్.లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ శృతి, సుగుణ, ప్రిన్సిపాల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణ, కో–ఆర్డినేటర్ లక్ష్మీకుమార్ అభినందించారు.

విద్యార్థికి బ్యాట్ పంపిన డేవిడ్ వార్నర్



వార్నర్ పంపిన బ్యాట్‌తో శ్రీహాస్

మామిడికుదురు: ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ క్రికెటర్ డేవిడ్ వార్నర్ లూటుకుర్రుకు చెందిన దుర్గా శ్రీహాస్‌కు క్రికెట్ బ్యాట్‌ను కానుకగా పంపించారు. ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీహాస్ పదో తరగతి చదువుతున్నాడు. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఇన్‌స్టాగామ్‌ను అతను కొంత కాలంగా ఫాలో అవుతున్నాడు. వార్నర్ పెట్టిన ఈవెంట్‌లో లక్కీడ్రా ద్వారా శ్రీహాస్ ఇన్‌స్టాగామ్ అకౌంట్ ఎంపికైంది. ఈ సందర్భంగా వార్నర్ తాను ఆడిన డీఎస్‌సీ బ్యాట్‌ను పంపించారు. ఈ సందర్భంగా శ్రీహాస్ మాట్లాడుతూ వార్నర్ వంటి ప్రముఖ క్రికెటర్ తనకు బ్యాట్ పంపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆ బ్యాట్‌తో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తానన్నాడు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

- రేషన్ వ్యాన్ అద్దాలు పగులగొట్టిన వైనం
- గంటావారిగూడెంలో వ్యక్తికి గాయాలు
- వాటర్ సర్వీసింగ్ సెంటర్ ధ్వంసం



గాయపడిన ఈబిచర్ల వెంకటేశ్వరరావు



దాడిలో ధ్వంసమైన సర్వీసింగ్ సెంటర్



మారెళ్లమూడిలో ధ్వంసం చేసిన రేషన్ వ్యాన్‌ను పరిశీలిస్తున్న పోలీసు

నల్లజర్ల: ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు జరిగాయి. నల్లజర్ల మండలం మారెళ్లమూడి గ్రామంలో భేతాళ దాసు నిర్వహిస్తున్న రేషన్ పంపిణీ వ్యాన్‌పై టీడీపీ కార్యకర్తలు బుధవారం దాడి చేసి ధ్వంసం చేశారు. అడ్డువచ్చిన కొవ్వూరు సుజాతరావు, బాబూరావు అనే వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో టీడీపీకే చెందిన జొన్నకూటి వెంకట్రావు కూడా గాయపడ్డాడు. తహసీల్దార్ కృష్ణారావు, ఏఎస్ఐ మోహనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గంటావారిగూడెంలో మంగళవారం టీడీపీ శ్రేణులు బైక్‌లపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తూ ఆ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. దాడిలో ఈబిచర్ల వెంకటేశ్వరరావు తలపై గాయమైంది. అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే ఉన్న తోట రామారావు, దొబ్బిడి అశోక్, దాసరి మధు అనే వ్యక్తులపై కూడా టీడీపీ శ్రేణులు దాడి చేసి గాయపరిచాయి. అనంతరం ఈబిచర్ల ప్రభాకరరావుకు చెందిన వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ధ్వంసం చేశారు. ఎన్నికల నాడు పోలింగ్ బూత్‌లలో జరిగిన అక్రమాలను అడ్డుకున్నందుకే తమపై ఈ దాడులు జరిగాయని వైఎస్సార్ సీపీ నాయకుడు తోట వెంకట్రావు వివరించారు. అలాగే చీపురుగూడెం శివారు తిమ్మన్నపాలెంలో టీడీపీ శ్రేణులు మంగళవారం బైక్‌లపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తూ వైఎస్సార్ సీపీ ఆ గ్రామ నాయకుడు పదిలం సుబ్బారావు వద్దకు వచ్చి ఆయనపై దాడికి యత్నించారు. సఫలం కాకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ఇక అనంతపల్లి గ్రామంలోని ఆర్టీసీ స్టాండ్‌ను పసుపు రంగుతో నింపేశారు. అంతేకాకుండా అప్పట్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకాన్ని వారు ధ్వంసం చేశారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

ముమ్మిడివరం: ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంకలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ జి.భైరవస్వామి బుధవారం తెలిపారు. ఈ మేరకు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ కూటమికి చెందిన కొప్పిశెట్టి సత్యానందం, కొప్పిశెట్టి మణిరామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవం జరుపుతుండగా, అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు కొక్కిరి గడ్డ సత్తిబాబుల మధ్య మాటమాట పెరిగి వివాదానికి దారి తీసింది. దీంతో ఇరువర్గాలూ ఘర్షణకు దిగాయి. కొక్కిరిగడ్డ సత్తిబాబు వర్గానికి చెందిన ఎనిమిది మందిపై, కొప్పిశెట్టి సత్యానందం వర్గానికి చెందిన 9 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ భైరవస్వామి వివరించారు

ఎంపీటీసీపై టీడీపీ కార్యకర్త దాడి



గాయపడిన గుణవీణ కుమార్

కాట్రేనికోన: కందికుప్ప పంచాయతీ బొజ్జావారిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త అయితాబత్తుల బాబ్జీ తనపై దాడి చేశాడని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్దాడ గుణవీణ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కందికుప్ప నుంచి మిలటరీపేటకు వెళ్తున్న తనపై బాబ్జీ బొజ్జావారిపేట జాంబవుల పేటకు వెళ్లే రోడ్డు సమీపంలో దాడి చేశాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు ముఖంపై బలమైన గాయం అయ్యిందని, దుర్భాషలాడుతూ చంపేస్తానని బెదిరించాడని అన్నారు. దీనిపై తమకు ఫిర్యాదు అందిందని కాట్రేనికోన ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.